క్లుప్తంగా

ఆలయ హుండీ లెక్కింపు



నగదు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, అధికారులు

మధిర: మధిర రామాలయ హుండీని దేవాదాయ, ధర్మదాయ శాఖ ఖమ్మం ఇన్స్పెక్టర్ సమత, ఈఓ రామకోటేశ్వరరావు సమక్షంలో శనివారం లెక్కించారు. రామాలయ హుండీ ద్వారా రూ.54,718 ఆదాయం సమకూరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీనివాసుల లక్ష్మీనారాయణ చార్యులు, రామాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ పల్లపోతు ప్రసాదరావు, సభ్యులు పంతంగి శేషగిరి, చలవాది కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్లు ఆవిష్కరణ



నూతన సంవత్సర క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

సత్తుపల్లిరూరల్: పట్టణంలోని విరాట్‌నగర్ శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శనివారం నూతన సంవత్సర క్యాలెండర్లను సంఘం బాధ్యులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మొగుదంపురం రామకృష్ణ, కోడూరి మోహనాచారి, నాగాచారి, బాణాల సత్యనారాయణ, ఎం.ఏడుకొండలు, బి.అప్పారావు, పి.రవికుమార్, సిహెచ్ వెంకటాచారి, టి.నాగాచారి, ఆర్.శ్రీహరి, వి.నాగేంద్రచారి, ఎం.రామకృష్ణ పాల్గొన్నారు.

'విజయ'లో నూతన సంవత్సర వేడుకలు



కేక్ కట్ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

కొణిజర్ల: మండలంలోని తనికెళ్ల సమీపంలో గల విజయ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం 2024 ముందస్తు నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు విద్యార్థులు కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.చిన్నయ్య, డాక్టర్ శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు

సైదేశ్వరరావు మృతికి సంతాపం



నివాళులర్పిస్తున్న లింగాల కమల్‌రాజ్, కొండబాల కోటేశ్వరరావు

చింతకాని: మండలంలోని ప్రొద్దుటూరు గ్రామంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడి సోదరుడు పెంట్యాల సైదేశ్వరరావు మృతదేహాన్ని శనివారం జెడ్పీ చైర్మన్ లింగాల కమలరాజ్, మధిర మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య, మండల నాయకులు మంకెన రమేష్, గద్దం శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మాస్కులు పంపిణీ



మాస్కులు పంపిణీ చేస్తున్న సిబ్బంది

కల్లూరు: మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సూచన మేరకు కల్లూరు మేజర్ గ్రామ పంచాయతీలో శనివారం సర్పంచ్ లక్కినేని నీరజ ఆధ్వర్యంలో మెయిన్ సెంటర్‌లో ప్రజలకు, ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు ఉచితంగా మాస్కులు పంపిణీ చేశారు. కరోనా విజృంభిస్తున్న కారణంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి.. కరోనాతో దూరంగా ఉండడానికి మాస్కులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ లక్కినేని రఘు, ఎండీ ఇస్మాయిల్, బానోత్ కృష్ణ, భద్రాచలం, వార్డు సభ్యులు దార్ల నరసింహారావు, కొత్తపల్లి వెంకటేశ్వరరావు, స్వరూప, ఎనుముల రాంబాబు, షేక్ అఫ్రోజ్, గండికోట కృష్ణ, బొడ్డు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నూతనోత్సాహం



సత్తుపల్లిలో రంగులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

కొత్త ఏడాది వేడుకలకు సర్వం సిద్ధం

- రంగవల్లుల కోసం రంగులు
- బేకరీల్లో రెడీగా కేకులు, స్వీట్లు
- ఆకర్షణీయంగా డైరీలు, క్యాలెండర్లు

సత్తుపల్లిటౌన్: ఆనందోత్సాహాల మధ్య నూతన సంవత్సరానికి స్వాగతం పలికేందుకు సర్వం సిద్ధమైంది. డిసెంబర్ 31న ప్రత్యేక సంబురాలు నిర్వహించేందుకు యువతతో పాటు వివిధ వర్గాలు, సంఘాలు సన్నద్ధమయ్యాయి. ఆదివారం సాయంత్రం నుంచే న్యూ ఇయర్‌జోష్‌లోకి వెళ్లేలా యువత కార్యక్రమాలను రూపొందిస్తున్నారు. ఇల్లు, దుకాణాలు, వ్యాపార, వాణిజ్య కార్యాలయాలను పూలు, చెంకీ దండలు, వివిధ రకాల తోరణాలతో అలంకరించేందుకు సిద్ధమయ్యారు.

రంగవల్లులు..

ప్రతీ ఇంటి ముందు కొత్త సంవత్సరానికి వెల్‌కం టూ న్యూ ఇయర్ అంటూ రంగవల్లులతో తీర్చిదిద్దేందుకు మహిళలు సిద్ధమయ్యారు. మార్కెట్‌లో రంగులను విరివిగా విక్రయ దుకాణాలు ఏర్పాటు చేశారు. మహిళలు, యువత ఎక్కువగా రంగులు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. 31వ తేదీ రాత్రి నుంచి రంగుల ముగ్గులను వేసేందుకు సన్నద్ధమౌతున్నారు. రంగుల దుకాణాలు మహిళలతో సందడిగా మారాయి.

డైరీలు, క్యాలెండర్లు..

న్యూ ఇయర్ వచ్చిందంటే ప్రతీ ఒక్కరు క్యాలెండర్లు, డైరీలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తారు. మార్కెట్‌లో 2024 సంవత్సరానికి సంబంధించిన డైరీలు, క్యాలెండర్లు అందుబాటులోకి వచ్చాయి. ఆకర్షణీయమైన డైరీలను కొనుగోలు చేసి అధికారులు, స్నేహితులకు అందించేందుకు సిద్ధమయ్యారు.



న్యూఇయర్ వేడుకలకు సిద్ధమైన కేకులు



ఆకర్షణీయంగా డైరీలు

స్వీట్లు, కేకులు తయారీ..

డిసెంబర్ 31, జనవరి 1వ తేదీల్లో సత్తుపల్లి పట్టణంలో పదివేల కేకులు అమ్ముడవుతాయని అంచనా వేస్తున్నారు. అపార్ట్‌మెంట్లు, కార్యాలయాలు, కాలనీలలో కేక్‌కట్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే స్వీట్స్ దుకాణాలు, బ్యాకరీలు, కేక్‌బాక్స్ సెంటర్లలో ప్రత్యేకంగా బట్టీలు పెట్టి కేకుల తయారీలో నిమగ్నమయ్యారు. వీటి అమ్మకాల కోసం టెంట్లు ఏర్పాటు చేశారు. కేక్‌లు కొనుగోలుపై కూల్‌డ్రింక్స్ ఆఫర్లు ఇస్తున్నారు. ఇక కొత్త సంవత్సరం వేడుకల్లో యువత ఎక్కువగా బిర్యానీ లాగించటానికే ఇష్టపడుతున్నారు. దీంతో పట్టణంలో రెస్టారెంట్లతో పాటు బిర్యానీ సెంటర్లలో అప్పుడే వీటి తయారీలో మునిగిపోయారు. అదే విధంగా కొన్ని రెస్టారెంట్లు వినియోగదారులు ఆకట్టుకునేందుకు ప్రత్యేకంగా ఆఫర్లు ప్రకటించాయి. ఆదివారం ఎక్కువ మొత్తంలో బిర్యానీలు అమ్మకాలు జరుగుతాయి కాబట్టి ఉదయం నుంచే తయారీపై దృష్టి పెడుతున్నారు.

రంగవల్లులతో స్వాగతిస్తాం..



న్యూ ఇయర్‌ను అందమైన రంగువల్లులతో స్వాగతించేందుకు సిద్ధమయ్యాం. మార్కెట్‌లో లభించే రంగులు తెచ్చాం. వీటితో ఆదివారం సాయంత్రం నుంచి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికే రంగవల్లులను వాకిళ్లలో వేస్తాం.

– డి.అనురాధ, సత్తుపల్లి

30 రకాలకుపైగా డైరీలు..



ఆకర్షణీయమైన డైరీలు, క్యాలెండర్లు అమ్మకానికి వచ్చేశాయి. రూ.100 నుంచి రూ.500 వరకు ధరలతో 30 రకాలకుపైగా డైరీలు అందుబాటులో ఉన్నాయి. స్నేహితులకు గిఫ్ట్‌గా డైరీలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

– దారా జగన్, సత్తుపల్లి

అన్ని రకాల కేకులు...



న్యూ ఇయర్ కోసం భారీగా కేకులు సిద్ధం చేస్తున్నాం. రెండువేల వరకు ఆఫ్‌కేజీ కేక్‌లు, 1,500ల వరకు కేజీ కేక్‌లు, కూల్‌కేక్‌లు అందుబాటులో ఉన్నాయి. రూ.120 నుంచి రూ.1400ల వరకు ఎగ్, ఎగ్‌లెస్ కేకులు ఉన్నాయి. ఇప్పటికే చాలా ఆర్డర్లు వచ్చాయి.

– ఎండీ హమీద్, కేక్‌బాక్స్ నిర్వాహకుడు, సత్తుపల్లి

సామాజిక తనిఖీ ప్రజావేదిక



రికార్డులు పరిశీలిస్తున్న అదనపు పీడీ శిరీష

ముదిగొండ: మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో ఉపాధిహామి పథకం కింద చేపట్టిన పనులపై శనివారం ముదిగొండలోని స్త్రీశక్తి భవనం వద్ద అదనపు పీడీ శిరీష ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో పనుల్లో అవకతవకలు జరిగినందుకుగాను రూ.33 వేలు రికవరీకి అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ హరిప్రసాద్, డీపీఓ వేణుమాధవ్, ఏపీడీ వెంకటపతిరాజు, అంబుడ్స్‌మెన్ రమేష్, క్యూసీ అభిలాష్, అసిస్టెంట్ విజిలెన్స్ మేనేజర్ పవన్, ఏపీఓ రంగనాయకమ్మ, ఎస్ఆర్పీ రమేష్, ఈసీలు విజయ్, కిరణ్‌కుమార్‌లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ అక్షింతల కలశాల ఊరేగింపు



శ్రీరామ అక్షింతల కలశాల ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు



మల్లవరం ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

కల్లూరు: జనవరి 22న అయోధ్యలో జరిగే శ్రీరామ మందిర ప్రారంభం, ప్రతిష్ఠ సందర్భంగా అయోధ్య నుంచి తీసుకొచ్చిన అక్షింతలకు కల్లూరు, తల్లాడ మండలాల్లో శోభాయాత్ర నిర్వహించారు. ఈ ఊరేగింపు తేరు బావి శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం నుంచి శ్రీ సంతాన వేణుగోపాల స్వామివారి దేవాలయం వరకు నిర్వహించారు. జనవరి 1నుంచి 15 వరకు ప్రతి ఇంటికీ అయోధ్య చిత్రపటం, శ్రీరామ పూజిత అక్షింతలు, జన సంపర్క్ అభియాన్, ఆహ్వాన పత్రికలు పంపిణీ చేయనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు సౌమిత్రి రామానుజాచార్యులు, డాక్టర్ లక్కినేని రఘు, బొడ్డు స్వామి, భక్తులు తదితరులు తెలిపారు.

తల్లాడ: అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముని అక్షింతలను శనివారం మండలంలోని మల్లవరం గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అయోధ్య మందిరం నుంచి కమిటీ వారు అక్షింతలు పంపించారు. దీంతో గ్రామంలోని భక్త బృందం ఆధ్వర్యంలో అక్షింతలను మేళతాళాలతో ఊరేగింపుగా నిర్వహించి రామాలయం వద్దకు తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎర్రి నరసింహారావు, దొనకొండ కృష్ణయ్య, కటికి ప్రసాద్, దుగ్గిదేవర శ్రీనువాసరావు, దొనకొండ నరసింహారావు, కృష్ణయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ

ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం మండలాల్లోని పలు గ్రామపంచాయతీల్లో కొనసాగుతుంది. ఆయా గ్రామ పంచాయతీల్లో శనివారం దరఖాస్తుదారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అర్జీలు సమర్పించగా.. అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా పలు సభల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని దరఖాస్తులను నింపే విషయంలో అవగాహన కల్పించారు. అర్హులందరు సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని, ఎటువంటి పక్షపాతం లేకుండా దరఖాస్తు ప్రక్రియ సాగాలని సూచించారు.

– సాక్షి నెట్‌వర్క్



ఎర్రుపాలెం: మాటాడ్లుతున్న అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్



బోనకల్: గోవిందాపురం(ఎల్)లో దరఖాస్తులను పరిశీలిస్తున్న జెడ్పీసీఈఓ అప్పారావు



వైరా: దరఖాస్తులు స్వీకరిస్తున్న మున్సిపల్ చైర్మన్ జైపాల్



తల్లాడ: అన్నారుగూడెంలో..



వేంసూరు: మొద్దులగూడెంలో..



కొణిజర్ల: దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీడీఓ మహాలక్ష్మి, ప్రజా ప్రతినిధులు

ఎమ్మెల్యేకు సత్కారం



ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌ను సత్కరిస్తున్న ఆర్యవైశ్యులు

వైరా: వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌ను శనివారం వైరా ఆర్యవైశ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకు రావడానికి ఆర్యవైశ్యుల కృషి కూడా మరిచిపోలేనిదన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొర్రా రాజశేఖర్, మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, శీలం వెంకటనర్సిరెడ్డి, వెంకటకృష్ణ, శబరినాధ్, రంగారావు, ఆర్యవైశ్య సంఘం నాయకులు రాఘవరావు, రాము, సత్యం, జనార్ధన్, నారాయణరావు, రాజారావు, శ్రీనివాసరావు, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

జార్ఖండ్ నుంచి కాశ్మీర్‌కు సైకిల్‌యాత్ర



తల్లాడ చేరుకున్న నాగేశ్వర కుమార్ సైకిల్ యాత్ర

తల్లాడ: జార్ఖండ్ నుంచి కాశ్మీర్ వరకు కొనసాగుతున్న సైకిల్ యాత్ర శనివారం తల్లాడ చేరుకుంది. జార్ఖండ్‌కు చెందిన నాగేశ్వర కుమార్ కాశ్మీర్ వరకు చేస్తున్న సైకిల్‌యాత్ర నేటితో 1,700 కిలో మీటర్లుకు చేరుకుంది. ఈ సందర్భంగా నాగేశ్వరకుమార్ మాట్లాడుతూ.. జాతీయ సమైక్యతకోసం ఈ సైకిల్‌యాత్ర చేపట్టినట్లు తెలిపారు. తాల్లాడ వాసులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రజియా సుల్తానా

సత్తుపల్లి: సత్తుపల్లి బాలికల జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎస్‌కె రజియాసుల్తానా మాట్లాడుతూ.. నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సాయి, సుశాంత్ పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజ మార్గం



మధిర: మెగా లోక్ అదాలత్‌లో పాల్గొన్న న్యాయమూర్తి కార్తీక్ రెడ్డి



సత్తుపల్లిటౌన్: పూలమొక్కను అందిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి పి.అరుణకుమారి

మధిర/సత్తుపల్లిటౌన్: రాజీ మార్గమే.. రాజ మార్గమని మధిర కోర్టు న్యాయమూర్తి కార్తీక్‌రెడ్డి, సత్తుపల్లి సీనియర్ సివిల్ జడ్జి పి.అరుణకుమారి తెలిపారు. మధిర కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించి 685 కేసులను పరిష్కరించారు. మధిర ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు 348 క్రిమినల్, ఎక్సైజ్ కేసులు పరిష్కారం కాగా.. రూ.44,170 జరిమానా విధించారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు 331 క్రిమినల్ కేసులు పరిష్కరించి.. రూ.78,600 జరిమానా విధించారు. రెండు కోర్టులలో ఆరు సివిల్ కేసులు పరిష్కారం అయ్యాయి. అదే విధంగా సత్తుపల్లి సబ్ కోర్టు ప్రాంగణంలో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 587 కేసులు పరిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజీపడటం వల్ల విలువైన సమయం ఆదా అవ్వడంతో పాటు డబ్బు వృథా కాదని, మనశ్శాంతి కూడా లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా రాజీ పడిన కక్షిదారులకు మొక్కలు అందించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు బోజెడ్ల పుల్లారావు, సీనియర్ న్యాయవాదులు వాసంశెట్టి కోటేశ్వరరావు, వాసిరెడ్డి వెంకటేశ్వరరావు, తూములూరి కృష్ణారావు, చింతల గోపాల్, దిరిశాల జగన్మోహన్‌రావు, దేవరపల్లి సుబ్రహ్మణ్యం, నంబూరు జనార్ధన్, వెంకట్రావు, రమేష్, విజయ్‌కుమార్, శ్రీనివాసరావు, పీపీలు నాగలక్ష్మి, భద్రయ్య, జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌కె ఆయేషాసరీన్, ఏసీపీ రామానుజం, బార్ అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు, ఏఓ రవికుమార్, కోర్టు సిబ్బంది, పోలీస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ముట్టడిస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి

సత్తుపల్లి: సింగరేణి ప్రభావంతో ఇళ్లన్ని దెబ్బతిన్నాయని.. తాగునీరు సక్రమంగా అందటం లేదని.. సమస్యలు పరిష్కరించకుంటే సింగరేణి కార్యాలయాలు ముట్టడిస్తామని సత్తుపల్లి ఎన్టీఆర్ కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్ 8వ వార్డు ప్రజాపాలన సభలో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ప్రసంగించి ఏమైన సమస్యలు ఉంటే చెప్పాలని కోరటంతో.. కాలనీ వాసులకు మద్దతుగా కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. స్పందించిన ఎమ్మెల్యే కాలనీ సమస్యలు నెలరోజుల్లో పరిష్కరించాలని జేవీఆర్ ఓసీ పీఓ ఎస్.వెంకటాచారి, మున్సిపల్ కమిషనర్ కె.సుజాతలను ఆదేశించారు. దీంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో కల్లూరు ఆర్డీఓ అశోక్‌చక్రవర్తి, ప్రత్యేకాధికారి సునీల్‌రెడ్డి, కౌన్సిలర్లు ఎస్‌కె ఛాంద్‌పాషా, మహ్మద్ అనీషా, ఎస్‌కె మౌలాలీ, రాంబాబు, నాయకులు పాల్గొన్నారు.

హామీలను సీఎం దృష్టికి తీసుకెళ్లండి..

సత్తుపల్లిరూరల్: సింగరేణి ఎన్నికల సందర్భంగా ఐఎన్‌టీయూసీ యూనియన్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను నెరవేర్చడానికి ప్రభుత్వం ముందుకు రావాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ సి.త్యాగరాజన్ కోరారు. సత్తుపల్లిలో శనివారం ఎమ్మెల్యే మట్టా రాగమయి, దయానంద్‌లను కలిసి ఐఎన్‌టీయూసీ విజయం సాధించిన సందర్భంగా సత్కరించారు. సింగరేణి సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి ఎమ్మెల్యే రామగయి మద్దతు కోరామన్నారు. కార్యక్రమంలో ఏరియా వైస్ ప్రెసిడెంట్ కె.ఆల్బర్ట్, ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ సభ్యులు రావి నాగేశ్వరరావు, ఫిట్ సెక్రటరీలు ఎస్.రామారావు, కోటి, బాలాజీ, జి.శ్రీనివాసరావు, కిరణ్, దావూద్ అలీ, భట్టివిక్రమార్క పాల్గొన్నారు.

ముగిసిన పాఠశాలల క్రీడలు



జెండా ఊపి పోటీలను ప్రారంభిస్తున్న రాజశేఖర్

కల్లూరు: కల్లూరులోని మినీ స్టేడియం వద్ద శనివారం మండల స్థాయి పాఠశాలల క్రీడలు నిర్వహించారు. 3,4,5 తరగతుల విద్యార్థులకు 50 మీటర్లు, 300 మీటర్ల పరుగు పందెం, స్టాండింగ్ లాంగ్ జంప్ నిర్వహించారు. మొత్తం 130 మంది బాలబాలికలు పాల్గొన్నారు. ఆటల పోటీలను విద్యాశాఖ సీఎంఓ రాజశేఖర్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ దామోదర ప్రసాద్, పసుపులేటి వీరరాఘవయ్య, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం జొన్నలగడ్డ నాగలక్ష్మి, యూపీఎస్ హెచ్‌ఎం బాలాజి నాయక్, ఉపాధ్యాయులు బీరవల్లి శ్రీనివాసరావు, పఠాన్ రహీమ్, వీరాస్వామి, నాగమణి, నాగలక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయులు కంద్రాతి రాధాకృష్ణ, రజిత, త్రివేణి, అనీల్ పాల్గొన్నారు.

భట్టి పర్యటనలో జర్నలిస్టుల అడ్డగింత

ఎర్రుపాలెం: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఎర్రుపాలెం మండల పర్యటన సందర్భంగా జర్నలిస్టుల విషయంలో పోలీసుల వైఖరి విమర్శలకు తావిచ్చింది. హెలిప్యాడ్ వద్దకు రావాలని కాంగ్రెస్ నాయకుల ఆహ్వానం మేరకు జర్నలిస్టులు వెళ్లారు. అప్పటికే హెలిప్యాడ్‌లో 50 మందికి పైగా కార్యకర్తలు, నాయకులు ఉండగా, జర్నలిస్టులను పోలీసులు అనుమతించలేదు. దీంతో డీపీఆర్‌ఓకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వగా, ఆయన కలెక్టర్‌కు నివేదించారు. చివరకు కలెక్టర్ సూచనలతో వైరా ఏసీపీ రెహమాన్, మధిర సీఐ వసంత్‌కుమార్ హెలిప్యాడ్‌లోకి జర్నలిస్టులను అనుమతించారు. మరోమారు ఇలా జరగకుండా చూస్తామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి సర్దిచెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

బోనకల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన పెద్దబీరవల్లి గ్రామం వద్ద శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే పెద్దబీరవల్లి గ్రామానికి చెందిన వేల్పుల శ్రీను ద్విచక్ర వాహనంపై పెద్ద బీరవల్లి నుంచి బోనకల్ వైపు వెళ్తుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108లో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

కల్లూరురూరల్: మండలంలో గుడుంబా స్థావరాలపై సీఐ ఆదేశాల మేరకు ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. బత్తుల పల్లి, కొత్తబోడి మల్లె, వచ్చనాయక్‌తండా, హనుమతండా లలో రైడ్స్ నిర్వహించారు. కొత్తబోడిమల్లెలో గుడుంబా తయారు చేస్తున్న మహిళపై కేసు నమోదు చేశారు. కల్లూరు ఎమ్మార్వో ముందు ప్రవేశపెట్టి బైండోవర్ చేస్తామని ఎస్సై వెంకటేశ్ తెలిపారు. ఈ దాడుల్లో అబ్కారి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక





అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన అంజనబాబు, సూర్యనారాయణ

మధిర: మధిర పట్టణంలో శ్రీనిధి స్కూల్లో మధిర డివిజన్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అంజనబాబు, కార్యదర్శి సూర్యనారాయణ, కోశాధికారి కాంతాల శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ స్కూల్స్ జిల్లా అధ్యక్షుడు కాంతారావు, కార్యదర్శి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం



వెంకటేశ్వర్లును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కొణిజర్ల: 2022 జనవరి 13 నుంచి నేటి వరకు పాఠశాలలో ఒక్క సెలవు కూడా పెట్టకుండా హాజరైన ఉపాధ్యాయుడిని శనివారం ఆ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. మండలంలోని బస్వాపురంలో గల గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న భూక్యా వెంకటేశ్వర్లు ప్రభుత్వం మంజూరు చేసిన 22 క్యాజువల్ లీవ్‌లు, గత రెండేళ్లుగా వినియోగించుకుంటూ ప్రతిరోజూ పాఠశాలకు హాజరవుతున్నడు. డిప్యూటీ వార్డెన్‌గా కూడా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సోమ్లా, సీనియర్ ఉపాధ్యాయులు కృష్ణారావు, సక్రాం.. శాలువ, పూలమాల జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీఆర్‌టీలు భాస్కర్, నాగేశ్వరరావు, నెహ్రూ, అశోక్‌కుమార్, రాంకిషన్ తదితరులు పాల్గొన్నారు.